క్లుప్తంగా

వేపాడలో నేత్ర వైద్యశిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ భవాని

వేపాడ: స్థానిక పాల ఉత్పత్తిదారుల సంఘ భవనంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో గురువారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ భవాని 45 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 22 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి, కళ్లద్దాలు అందజేస్తామని శిబిరం సమన్వయకర్త జోగారావు తెలిపారు.

కాలంరాజుపేటలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేట గ్రామ సచివాలయంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో గురువారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. 58 మందికి వైద్యాధికారి, సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి శిబిరానికి రాలేకపోయిన గర్భిణులు, వృద్ధులకు వైద్య తనిఖీలు చేశారు.

మహారుద్ర హోమం



హోమం చేస్తున్న అర్చకులు

గుర్ల: కార్తీక మాసం నేపథ్యంలో స్థానిక శివాలయంలో అర్చకులు అరవెల్లి సురేష్‌శర్మ, తరుణ్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం మహారుద్ర హోమం,అభిషేకాలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మహారుద్ర హోమం, అభిషేకాలు చేశామని అర్చకులు తెలిపారు. శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉమానీలకంటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా పురోహితులు ఏ.శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారు జాము న రుద్రాభిషేకం, హోమాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు నేడు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ సీఐడీ అదనపు ఎస్పీ జి. ప్రేమకాజల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల వారికి తమ హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా ఆయా వర్గాల్లో సామాజిక సాధికారత సాధించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గల వెంకటసాయి కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్ హాజరవుతారని పేర్కొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి ..



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేష్

గంట్యాడ: డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని చంద్రంపేటలో డయేరియా, సీజనల్ వ్యాధుల పట్ల గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ మలవిసర్జన, కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తినడం వల్ల డయేరియా వ్యాపిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బానోజీరావు, ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

కియోస్క్ సేవలకు మంగళం..!

- రైతు సేవా కేంద్రాల్లో అలంకారప్రాయంగా కియోస్క్ యంత్రాలు
- అన్నదాతలకు అందని డిజిటల్ సేవలు
- ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం ఇక్కట్లు



కె. కొత్తవలస రైతు సేవా కేంద్రం

దత్తిరాజేరు: అన్నదాతల సంక్షేమం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పెట్టుబడి సాయం నుంచి, పంటల సాగు, మార్కెటింగ్ వరకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలిచింది. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని నిరూపించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ గ్రామ సచివాలయంలో పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు అందించారు. పంటలసాగుకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు అందించేవారు. లక్షల రూపాయలు వెచ్చించి రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) కియోస్క్(డిజిటల్ టచ్ స్క్రీన్)యంత్రాలను ఏర్పాటు చేసి డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక ఆర్బీకేల పేరును ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. పేరు మార్చేందుకు చూపించిన ఉత్సుకత సేవలు అందించడంలో చూపించడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ సేవలు నిలిచిపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కియోస్క్ యంత్రాలు అలంకార ప్రాయంగా మారాయి.

గజపతినగరం నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల వివరాలు

మండలం	రైతు సేవాకేంద్రాల సంఖ్య
దత్తిరాజేరు	17
గజపతినగరం	20
బొండపల్లి	17
గంట్యాడ	21

కియోస్క్‌తో సేవలు అందేవి ఇలా..

రైతులకు డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఆర్బీకేల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. ఇది ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే యంత్రం. ఇందులో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను రైతులు ఆన్‌లైన్‌లో కొనుగోలుచేసుకునే వారు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న ధరల వివరాలను ఈయంత్రం ద్వారా తెలుసుకునేవారు. అలాగే పంటల సాగు యాజమాన్య పద్ధతులకు సంబంధించిన సంక్షిప్త వీడియోలు, వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు సాగు చేయాలనే వివరాలను ఈ కియోస్క్ ద్వారా తెలుసుకునే వారు. రైతులు కియోస్క్‌లో తమ ఆధార్, ఫోన్ నంబర్‌ను నమోదు చేసిన తర్వాత డిజిటల్ సేవలు ప్రారంభమయ్యేవి. తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వివరాలను రిజిస్టర్ చేసుకునే వారు. రిజిస్టర్ అయిన తర్వాత మొబైల్‌కు ఓటీపీ వచ్చేది.అక్కడే ఫోన్ పే, లేదా క్యూఆర్ కోడ్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ పూర్తి చేసేవారు. ఈ ప్రక్రియ ముగిసిన 48 నుంచి 72 గంటల్లోగా వారు బుక్ చేసుకున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఆర్బీకేలకు చేరేవి. ఈ సమాచారం రైతుల ఫోన్‌లకు సంక్షిప్త సందేశం ద్వారా అందేది. రైతులు రైతు భరోసా కేంద్రాలకు వచ్చి వాటిని తీసుకుని వెళ్లేవారు. ఈ మొత్తం విధానంలో ప్రభుత్వ పర్యవేక్షణ ఉండడం వల్ల నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రైతులకు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సేవలు నిలిచిపోయాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



దత్తిరాజేరు రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

కియోస్క్ సేవలు కొనసాగించాలి



గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా ఎరువులు,విత్తనాలు పురుగులు మందులు అందించేవారు. కియోస్క్ యంత్రంలో కూడా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను బుక్ చేసుకునే వాళ్లం. వ్యవసాయ యంత్రాలు, పంటల మార్కెటింగ్, యాజమాన్య పద్ధతులు, తదితర సమాచారం తెలిసేది. ప్రస్తుతం ఈ సేవలు అందడం లేదు. గతంలో మాదిరిగానే కియోస్క్ సేవలను కొనసాగించాలి.

ఎస్.ముకుంద రైతు, బిల్లలవలస గ్రామం, బొండపల్లి మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని పాలవలస ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో గరికివలస, గోవుపేట, ముద్దాడపేట, కొండగంగ్రేడు, బూర్లెపేట, ఫకీరుకిత్తలి, మునకా లపేట, గేదెలపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించా లని కోరారు.

ఎల్.కోట సబ్‌స్టేషన్ పరిధిలో..

లక్కవరపుకోట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు ఫీడర్ మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్.కోట,సోంపురం జంక్షన్, సంతపేట జంక్షన్ పరిధి ప్రాంతా లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమిటీలకే దేవాలయ నిర్వహణ బాధ్యతలు



వల్లంపూడి విలేకరులతో మాట్లాడుతున్న విశ్వహిందు పరిషత్ సభ్యులు

వేపాడ: హిందూ దేవాలయాల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం నుంచి తప్పించి ఆలయ కమిటీలకు అప్పగించాలని ఆర్ఎస్ఎస్ బాధ్యుడు భీశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వల్లంపూడిలో గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. ఆలయాల నిర్వహణ విషయమై వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం పేరిట భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిపై కార్యచరణ నిమిత్తం ఈ నెల 9న గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాలకు చెందిన కార్యకర్తలతో సన్నాహక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లట్టాల పవన్ కుమార్‌శర్మ, కె.అప్పారావు, సీహెచ్ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు వరప్రసాద్

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీవద్ద కల్యాణ్ నగర్‌లోని ఐశ్వర్యలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

తాటిపూడి పర్యాటకాభివృద్ధిపై ఆరా



తాటిపూడి రిజర్వాయర్ ప్రాంత మ్యాప్‌ను పరిశీలిస్తున్న రోహన్

గంట్యాడ: మండలంలోని తాటిపూడి రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ ముంబై అసోసియేట్ చైర్మన్ రోహన్ రానడే గురువారం పర్యటించారు. రిజర్వాయర్ ప్రాంత మ్యాప్‌ను పరిశీలించారు. ఇక్కడ పర్యాటక అభివృద్ధి, రిసార్ట్స్, హోటల్స్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, ఏపీ స్టేట్ టూరిజం ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లివీడులో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడులో బుడం శ్రీను ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రెండంతస్తుల ఇంటిలో శ్రీను భార్య, పిల్లలు గ్రౌండ్ ఫ్లోర్‌లో టీవీ చూస్తుండగా..పై అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ముందుగా ఫ్రిజ్ వద్ద పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. ఫ్రిజ్‌కు సంబంధించిన గ్యాస్ ట్యాంక్ పేలిపోవడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. దీంతో దుస్తులు, మంచాలు, సోఫాలు, ఏసీ కాలిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 74 వేల రూపాయల నగదు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి



బొండపల్లి: నెలివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న బొండపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



గంట్యాడ: వసాది గ్రామంలో అవగాహన కల్పిస్తున్న పెద్దమజ్జిపాలెం పీహెచ్‌సీ వైద్యులు పల్లవి, సతీష్

క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. బొండపల్లి మండలంలోని నెలివాడ, దత్తిరాజేరు మండలంలోని కె. కొత్త వలస, గంట్యాడ మండలంలోని వసాది, కొత్తవలస మండల కేంద్రంతో పాటు వియ్యంపేటలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. క్యాన్సర్ లక్షణాలను వివరించారు. ఖైనీ , గుట్కా, పొగాకు ఉత్పత్తులకు, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు.

– బొండపల్లి/గంట్యాడ/దత్తిరాజేరు/కొత్తవలస



కొత్తవలస: కొత్తవలసలో అవగాహన కల్పిస్తున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ



దత్తిరాజేరు: కె.కొత్తవలసలో ర్యాలీ చేస్తున్న ఆ గ్రామ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

కృత్రిమ అవయవాల పంపిణీ



కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 25 మంది దివ్యాంగులకు విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో గురువారం కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, పోలియో కాలిపర్స్ పంపిణీ చేశారు. గురుదేవ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యకర్తలు గుప్త, జి.శిరీష, కల్పనా కుక్రేజ, సునీతా జైన్, లక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– కొత్తవలస

108 ఉద్యోగుల నిరసన



తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్.కోట నియోజకవర్గంలో పనిచేస్తున్న 108 సిబ్బంది ఎస్.కోటలో గురువారం నిరసన తెలిపారు. మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.108 పైలట్లు ఎం.ఎస్.ఎన్.మూర్తి, విజయ్‌కుమార్, ఎల్లారావు, ఈఎంటీలు ఈ.రమేష్, సీహెచ్. సన్యాసినాయుడు, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ –19 నెట్‌బాల్ పోటీలకు బొండపల్లి మండలంలోని గొట్లాం హైస్కూల్ నుంచి బాలుర విభాగంలో 12 మంది, బాలికల విభాగంలో 12మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.శ్రీరామాచారి తెలిపారు. బొబ్బిలిలోని చింతాడ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. ఈనెల10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.విద్యార్థులను పీడీలు యు.సత్యానంద్, ఎల్.వి.రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

–బొండపల్లి

వేతన బకాయిలు చెల్లించండి

జామి/ చీపురుపల్లిరూరల్(గరివిడి):



జామి: డీటీ నారాయణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని 104 వైద్య సిబ్బంది ఆవే దన వ్యక్తం చేశారు. తమ బకాయి వేతనాలు చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జామి మండల పరిధి సిబ్బంది ఆ మండల కేంద్రం లో డీటీ నారాయణమూర్తి, ఎంపీడీఓ అప్పలనాయుడుకు, గరివిడి మండలం పరిధి సిబ్బంది బొండపల్లిలో పీహెచ్‌సి వైద్యాధికారి ఎం.అనిల్‌కు మార్ కు గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వ హించాలని, 2020 తర్వాత విధుల్లో చే రిన 104 వాహన డ్రైవర్లకు, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆయుష్ సేవలపై అవగాహన కల్పించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి సునీత, ఆశ కార్యకర్తలు

బొండపల్లి: ఆయుష్ వైద్యసేవలను వినియోగించుకునేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని గొట్లాం ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి బి.సునీత ఆశ కార్యకర్తలను కోరారు. ఆయుష్ వైద్యసేవలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆశ కార్యకర్తలకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా పలువ్యాధులకు ఆయుష్ వైద్యం ద్వారా మెరుగైన చికిత్స అందించవచ్చని చెప్పారు. ప్రజల్లో చాలా మందికి ఈ వైద్య సేవలపై అవగాహన లేదని, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ.బాషా, పీహెచ్ఎన్ రోజారమణి, హెల్త్ అసిస్టెంట్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమావేశం



రైతులతో సమావేశమైన ఏఓ రవీంద్ర

శృంగవరపుకోట: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరు తెన్నులపై సంతగవిరమ్మపేట గ్రామ రైతులకు ఏఓ కె.రవీంద్ర గురువారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ ధాన్యంలో తేమ 17శాతం ఉండాలని, సరైన మద్దతు ధర పొందేందుకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. వ్యర్థాలు, మట్టి ఒక శాతం , రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం 5 శాతం, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం మించకూడదన్నారు. గోనె సంచులు, రవాణా చార్జీలు, లేబర్ చార్జీల చెల్లింపులు తదితర అంశాలను వివరించారు. వీఏఏ రవి పాల్గొన్నారు.

ధర్మవరంలో డెంగీ కలకలం

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం గ్రామంలో డెంగీ కలకలం రేగింది. కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక గురువారం విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరం గ్రామానికి చెందిన కక్కల ఎర్నమ్మను ప్రసవం కోసం కొట్టాం పీహెచ్‌సీ నుంచి విజయనగరం ఘోషా ఆస్పత్రికి రిఫర్ చేశామని చెప్పారు. అక్కడ ఆమె ప్రసవించిన తర్వాత జ్వరం రావడంతో వైద్యులు పరీక్షలు చేయగా, డెంగీ సోకినట్లు నిర్ధారణ అయిందని, వైద్యం అందించడంతో ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని తెలిపారు.డెంగీ బాధితురాలి ఇంటికి చుట్టుపక్కల ఉన్న 50 కుటుంబాల వారికి వైద్యపరీక్షలు చేయిస్తున్నామని చెప్పారు. అలాగే గ్రామంలో ఫాగింగ్ చేయించామని పేర్కొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సోంపురం ఉన్నత పాఠశాలలో వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని సోంపురంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించా రు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్లలోని వ్యర్థ పదార్థాలను డస్ట్‌బిన్‌లో వేసి ఉదయాన్నే ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడ ర్లకు అందజేయాలని, వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి, వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.